సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం। 22। సెప్టెంబర్। 2025



నేటి నుంచి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. నేటినుంచి ఉత్సవాలు మొదలుకానున్నాయి. - 10లో



అలైన్‌మెంట్ మార్చాలి

రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిశారు. - 10లో



లక్ష్మణ్ బాపూజీకి నివాళి

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించారు. - 11లో

న్యూస్‌రీల్

కొత్త పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం రెండు నూతన పథకాలు ప్రవేశపెట్టిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పరాంకుశం సాహితీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పేరుతో ఒంటరి మహిళలు, వితంతువులు, విడాకులు తీసుకున్నవారు, అనాథలు, అవివాహిత మహిళలకు చిన్న వ్యాపారాల కోసం రూ 50,000 ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 'రేవంతన్నా కా సహారా' కింద ఫకీర్, దుదేకుల వంటి వెనుకబడిన వర్గాలకు మోపెడ్ వాహనాల కొనుగోలు లక్ష రూపాయల గ్రాంట్ ఇవ్వనుంది. అర్హులు నేటి(ఆదివారం)నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు Ðtgo bmmr.cff.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిని సంప్రదించాలన్నారు.


యాదగిరి నృసింహుడికి నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పర్వాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం నేత్రపర్వంగా చేపట్టారు. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, సువర్ణ ప్రతిష్ఠా అలంకార మూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయంలో ఊరేగించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఆదివారం ప్రాజెక్టు నాలుగు క్రస్ట్‌గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు ఎగువ ప్రాంతాల నుంచి మూసీకి 5,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా క్రస్ట్ గేట్ల నుంచి 4,965 క్యూసెక్కులు, మూసీ కుడి, ఎడమ కాల్వలకు 625 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 4.46 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంగల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 4.12 టీఎంసీల నీరు ఉంది.



బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

భూదాన్‌పోచంపల్లిలో ఆదివారం బతుకమ్మ ఆడుతున్న మహిళలు



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో..



గుండాల మండల కేంద్రంలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

ధాన్యం నిల్వకు చోటెక్కడ?

చేతికి రానున్న వానాకాలం పంట

- సీఎంఆర్ బియ్యంతో గోదాములన్నీ ఫుల్
- రైస్ మిల్లుల్లోనూ యాసంగి ధాన్యం
- ఖాళీ చేస్తేనే ధాన్యం దిగుమతికి అవకాశం
- ఇటీవల అదనపు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించిన మిల్లర్లు

సాక్షి, యాదాద్రి : జిల్లా పరిధిలోని ఎఫ్‌సీఐ, సివిల్ సప్లై గోదాములు బియ్య బస్తాలతో పూర్తిగా నిండిపోయాయి. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణలో ఎఫ్‌సీఐ వద్ద జరుగుతున్న జాప్యం వల్ల మిల్లులు సకాలంలో ఖాళీ కావడం లేదు. సీఎంఆర్ బియ్యాన్ని ఎప్పటికప్పుడు తరలించకపోతే వానాకాలం ధాన్యం దిగుమతిపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని మిల్లర్లు అంటున్నారు. ఈ విషయంపై నాలుగు రోజుల క్రితం అదనపు కలెక్టర్ వీరారెడ్డిని కలిసి వివరించారు.

4.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా..

జిల్లాలో ఈ వానాకాలం 2.75 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో దొడ్డు రకం 1,85,951 ఎకరాలు, సన్నాలు 20,661 ఎకరాల్లో సాగు చేశారు. దొడ్డు, సన్నరకం కలిపి 4.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు తమ సొంత అవసరాలకు, మిల్లర్లు, ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తారని లెక్క కట్టారు. మిగతా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఐకేపీ, పీఏసీఎస్, వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కాగా వానాకాలం ధాన్యం



నాగిరెడ్డిపల్లిలోని ఎఫ్‌సీఐ గోదాము వద్ద బియ్యం లోడ్‌తో నిలిచిపోయిన లారీలు

చేతికి రానున్న తరుణంలో కనీసం 70వేల మెట్రిక్ టన్నుల వడ్లు నిల్వ చేయడానికి వీలుగా గోదాములు ఖాళీ ఉండాలి. కానీ, 30వేల మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వ చేయడానికి అవకాశం ఉంది.

గోదాములలో ప్రస్తుతం ఉన్న నిల్వలు

ఎఫ్‌సీఐ గోదాముల్లో సుమారు 65 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం నిల్వ ఉంది. ఇందులో నాగిరెడ్డిపల్లి గోదాములో 50 వేలు, వలిగొండలో 5 వేలు, జనగామ జిల్లా రఘునాథపల్లిలో 10 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ ఉన్నాయి. వీటిని వెంటవెంటనే తరలిస్తేనే గోదాములు ఖాళీ అవుతాయి. ఒకసారి గూడ్స్ వ్యాగన్ వస్తే 5వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి అవుతుంది. వారంలో కనీసం రెండు సార్లు గూడ్స్ వ్యాగన్లు రావాలి. కానీ, రోజుల తరబడి రాకపోవడంతో గోదాముల్లోనే బియ్యం మూలుగుతున్నాయి. మిల్లుల నుంచి బియ్యం లోడుతో వెళ్లిన లారీలు రోజుల తరబడి ఖాళీ కావడం లేదు. గోదాములు నిండుగా ఉండటంతో గత వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని మరాడించడం ఇబ్బందిగా మారిందని మిల్లర్లు వాపోతున్నారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

వానాకాలం పంట త్వరలో చేతికి రానుంది. ధాన్యం సేకరణకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. మొత్తం దిగుబడిలో 3లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించాలి. మిల్లుల్లో ఖాళీ స్థలం లేకపోవడం, ప్రస్తుతం ఉన్న నిల్వలను ఇప్పటికప్పుడు ఎగుమతి చేసే పరిస్థితి లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. వడ్లను నిలువ దిగుమతి చేసుకోవడానికి తుర్కపల్లి, భూదాన్ పోచంపల్లి వలిగొండ, ఆలేరు, మైలారం సివిల్ సప్లై గోదాములను అందుబాటులో ఉంచారు. వీటిలో 30 వేల టన్నుల ధాన్యం నిల్వ చేయటానికి వీలుంటుంది. అదే విధంగా రామన్నపేట, బీబీనగర్, వంగపల్లితో పాటు పొరుగున ఉన్న చర్లపల్లి ఎఫ్‌సీఐ గోదాములను సైతం సిద్ధం చేస్తున్నారు. వీటి సామర్థ్యం 45 వేల మెట్రిక్ టన్నులు.

ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం

వానాకాలం ధాన్యాన్ని యథావిధిగా దించుకోవడానికి మిల్లర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం. ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని త్వరగా ఖాళీ చేయాలని సంబంధిత ఉన్నతాధికారులకు లేఖలు రాశాం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎఫ్‌సీఐ గోదాములకు అదనంగా మరో 45 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఎఫ్‌సీఐ వారు ఎప్పటికప్పుడు బియ్యాన్ని తరలిస్తే మిల్లర్లు చెప్పిన ఇబ్బందులు ఉండవు. వానాకాలం ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం. 4.50లోల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం.

– గోపిరెడ్డి వీరారెడ్డి, అదనపు కలెక్టర్(రెవెన్యూ)

పేద, మధ్య తరగతికి దన్ను

- జీఎస్టీ స్లాబ్‌ల కుదింపు నేటినుంచి అమల్లోకి
- ఇకపై 5, 18 శాతం స్లాబ్‌లు మాత్రమే కొనసాగింపు



పేదలు, మధ్య తరగతికి దసరా పండుగ ముందే వచ్చేస్తోంది. ఆయా వర్గాలకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కుదించిన జీఎస్టీ (వస్తు సేవల పన్ను) స్లాబ్‌లు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతమున్న నాలుగు స్లాబుల్లో ఇకపై 5 శాతం, 18 శాతం పన్ను స్లాబ్‌లకే పరిమితం కానున్నాయి. 12 శాతం, 28 శాతం పన్ను స్లాబ్‌ల తొలగింపుతో సరుకులన్నీ అగ్గువకే అందిరానున్నాయి. వీటితో పాటు పాలు, పనీర్, బిస్కెట్లు, సబ్బులు, షాంపూల నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, చిన్న కార్లు, బైకుల దాకా ధరలు దిగిరానున్నాయి. ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ రద్దుతోపాటు 33 రకాల అత్యవసర మందులపై పన్ను పూర్తిగా తొలగిపోనుండటంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

– భువనగిరి - వివరాలు 10లో

పాడి రైతులను మోసం చేసిన కాంగ్రెస్



యాదగిరిగుట్టలో పాడిరైతుల దీక్షకు సంఘీభావం తెలిపిన గొంగిడి మహేందర్‌రెడ్డి

- పాడి రైతులను ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదు
- బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: పాడి రైతులను ప్రభుత్వం మోసం చేసిందని, త్వరలో జరగనున్న మదర్ డెయిరీ డైరెక్టర్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. పాడి రైతుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యాదగిరిగుట్ట పట్టణంలో మదర్ డెయిరీ డైరెక్టర్లు కస్తూరి పాండు, కందాల అలివేలు రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదర్ డెయిరీ ఎన్నికల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాడి రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నేటికీ నెరవేర్చలేదన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయిస్తామని, రూ.30 కోట్ల గ్రాంట్ తీసుకువస్తామని, రూ.4 బోనస్ ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి రైతులను నమ్మించి గెలిచారని ఆరోపించారు. ఇప్పుడు డైరెక్టర్ పదవులకు ఎన్నికలు రావడంతో కొత్త నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మదర్‌డెయిరీ నుంచి సంక్షేమ హాస్టళ్లకు 12వేల లీటర్ల పాలు సరఫరా చేసే వాళ్లమని, ఇప్పుడున్న డెయిరీ చైర్మన్ అసమర్థ వల్ల ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. అంతే కాకుండా ఇప్పటికే వేములవాడ, కీసర, చెరువుగట్టు వంటి ఆలయాలకు మదర్‌డెయిరీ సంస్థ నుంచి నెయ్యి సరఫరా నిలిపివేశారని, యాదగిరి క్షేత్రానికి సైతం నిలిపివేసే కుట్ర జరుగుతుందన్నారు. అడ్డుకోవాల్సిన స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో డెయిరీ అభివృద్ధి బాటలో పయనించగా.. కాంగ్రెస్ చేతిలోకి వెళ్లిన తరువాత అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఇప్పుడున్న చైర్మన్ కమీషన్లకు కక్కుర్తిపడి సంస్థను మూలపడేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులతో పెట్టుకున్న ప్రభుత్వాలు ఎక్కువకాలం కొనసాగలేదని, రేవంత్ సర్కార్ సైతం కూలిపోతుందన్నారు. దీక్షలో డైరెక్టర్లు కస్తూరి పాండు, కందాల అలివేలు మంగమ్మ, మాజీ డైరెక్టర్లు దొంతిరి సోమిరెడ్డి, ఒగ్గు భిక్షపతి, పాలసంఘం చైర్మన్లు మారెడ్డి కొండల్‌రెడ్డి, సందిళ్ల భాస్కర్ గౌడ్, విజయ, ఇందిర, సతీష్‌రెడ్డి, రంగయ్య, ప్రభాకర్, లింగారెడ్డి, అంజనేయులు, కిష్టయ్య, మల్లేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, సట్టు తిరుమలేష్, బీసు చందర్‌గౌడ్, మల్లేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, తోటకూరి బీరయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, మిట్ట వెంకటయ్యగౌడ్, పల్లా వెంకట్‌రెడ్డి, ఎగ్గిడి కృష్ణ పాల్గొన్నారు.

పలు మండలాల్లో భారీ వర్షం

- జనగామలో ఇళ్లలోకి చేరిన నీరు
- రాత్రంతా నిద్రలేకుండా గడిపిన ప్రజలు

సాక్షి యాదాద్రి, సంస్థాన్‌నారాయణపురం : జిల్లాలోని పలు మండలాల్లో శనివారం రాత్రి, ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూర్(ఎం) మండలంలో 120 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మోత్కూరులో 98 మీ.మీ, బొమ్మల రామారం 87 మీ.మీ, గుండాల 76 మి.మీ, బీబీనగర్ 70 మీ.మీ, ఆలేరు 60 మీ.మీ, మూటకొండూరులో 50 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షానికి ఆలేరు, బీబీనగర్‌లో రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగామలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి లోతు నీరు చేరింది. దీంతోసామగ్రి తడిసింది. రాత్రంతా ప్రజలు జాగారం చేశారు. గ్రామ పరిధిలోని జానకమ్మ, గంగాముల చెరువుల్లోకి నీరు చేరుతోంది. వర్షానికి బతుకమ్మ వేడుకలకు అంతరాయం ఏర్పడింది.



జనగామలో ఇళ్లలోకి చేరిన వరద

కొత్తిమీర @ 30

భువనగిరి: జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో కొత్తిమీర ధర కొండెక్కింది. సాధారణంగా కట్ట రూ.7నుంచి రూ.10కు అమ్ముతుండగా మూడు రోజులుగా 30 రూపాయలకు విక్రయిస్తున్నారు. స్థానిక తోటలతో పాటు హైదరాబాద్ నుంచి సరిపడా కొత్తిమీద దిగుమతి కావడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొత్తిమీర తోటలు దెబ్బతినడమే కారణమని వ్యాపారులు అంటున్నారు.



దాతల చేయూత.. మారిన బడిరాత

కార్పొరేట్‌కు దీటుగా మల్యాల కేజీబీవీ

- కోటి రూపాయల సీఎస్ఆర్ ఫండ్‌ను సమకూర్చిన ఎస్‌ఓ సాయిలక్ష్మి
- మొదటి విడతలో రూ.80 లక్షలతో సౌకర్యాల కల్పన
- రెండో విడతలో రూ.20 లక్షలతో మరికొన్ని అభివృద్ధి పనులు

బొమ్మలరామారం: నేటికీ పలు పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుండగా.. కొన్ని మాత్రం అన్ని విధాలా అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలుస్తున్నాయి. అందుకు నిదర్శనం బొమ్మల రామారం మండలంలోని మల్యాల గ్రామ కస్తూరిబాగాంధీ విద్యాలయం. ప్రిన్సిపాల్ కందుకూరి సాయిలక్ష్మి చొరవతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకుంది. 2023 జూన్ 7న మల్యాల కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయిలక్ష్మి.. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారు. ప్రభుత్వ నిధులతో కల్పించిన సౌకర్యాలకు తోడుగా దాతల సహకారంతో మరిన్ని వసతులు సమకూర్చి పాఠశాల రూపురేఖలే మార్చారు. ప్రిన్సిపాల్ చొరవతో ఇంధన పరికరాల తయారీకి చెందిన జీఈ వెర్నోవా కంపెనీ కోటి రూపాయల సీఎస్ఆర్ ఫండ్ ఇవ్వగా అందులో పాఠశాల అభివృద్ధికి రూ.80లక్షలు వెచ్చించారు. మరో రూ.20లక్షలతో ఇంకొన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

వలంటీర్ల బృందం

కేజీబీవీలో సమస్యలు, అవసరమైన సౌకర్యాల గురించి స్పెషల్ ఆఫీసర్ సాయిలక్ష్మి.. ఇంధన పరికరాల తయారీలో ప్రఖ్యాతి గాంచిన జీఈ వెర్నోవా కంపెనీ వలంటీర్ల బృందం గుర్రపు రాజు, రుద్ర సుధాకర్, అద్దెపల్లి భానుప్రసాద్, దుండిగల్ల ధీరజ్ తదితరులు దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలను సందర్శించి వలంటీర్ల బృందం.. కంపెనీ అధికారులకు నివేదిక అందజేసింది. దీంతో సీఎస్ఆర్ ఫండ్ నుంచి కోటి రూపాయలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. పాఠశాలలో వసతుల కల్పన బాధ్యతలను యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అనే సంస్థకు అప్పగించింది. మొదటి విడతలో రూ.80లక్షలు కేటాయించి కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించారు.

ఎక్కడికెళ్లినా తన మార్క్

సాయిలక్ష్మి ములుగు జిల్లా ఏటూరినాగారం కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా తొమ్మిదేళ్ల విధులు నిర్వహించారు. నాణ్యమైన బోధన, దాతల సహకారంతో సౌకర్యాలకల్పనలో అక్కడ కూడా తన మార్క్ కనబరిచారు. అదే విధంగా ఎన్‌జీఓల సహకారంతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు, డీఫ్లోరైడ్ వాటర్ ప్లాంట్ నిర్మాణం, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.



మల్యాల కేజీబీవీలో అధునాతన సైన్స్ ల్యాబ్



సోలార్ ప్యానెళ్లు



తరగతి గదుల గోడలపై బోధన చిత్రాలు

చదువుకు ఆటంకం కలగొద్దని..



ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు చదువుతుంటారు. వారికి నాణ్యమైన బోధన అందించడంతో పాటు కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించేందుకు దాతల కోసం అన్వేషించాను. సామాజిక సేవా దృక్పథం కలిగిన జీఈ వెర్నోవా కంపెనీ వలంటీర్ల బృందాన్ని కలిసి సమస్య వివరించా. వలంటీర్ల చేయూత, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సహకారం అభినందనీయం.

– కందుకూరి సాయిలక్ష్మి, కేజీబీవీ ఎస్‌ఓ



తాగునీటి సౌకర్యం

సమకూరిన సౌకర్యాలివీ..

మొదటి విడతలో రూ.80లక్షలతో కేజీవీబీ భవనంతో పాటు వసతిగృహానికి ఐరెన్ గ్రిల్స్, 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ సంపు నిర్మాణం, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌ల ఏర్పాటు, లైబ్రరీ పుస్తకాలు, కిచెన్ గార్డెన్, 60 డ్యూయల్ డెస్క్ బెంచీలు, భోజనశాల కోసం నేసీతో కూడిన షెడ్ నిర్మాణం, గదుల్లో విద్యుత్ పనులు, వాష్ ఏరియా నిర్మాణం చేశారు. వీటితో పాటు 120 స్టాండ్‌లతో కూడిన మ్యాట్రస్‌లు, పాఠశాల గదుల్లో ప్యాబ్రికేషన్, ప్లంబింగ్ పనులు, వసతిగృహంలో 5 కిలో వాట్స్ సోలార్ సెటప్ (ఏఎంసీతో) ప్రొజెక్టర్, ఎనిమిది సీసీ కెమెరాలు, ఆరు బాత్రూంలు, ఫర్నిచర్, విద్యార్థులకు ఎంసెట్ పుస్తకాలు సమకూరాయి.

రూ.20లక్షలతో కల్పించనున్న వసతులు

18 గదులకు న్యూ హౌజ్ వైరింగ్, 10 సీసీ కెమెరాలు, చపాతి మేకర్, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థుల సామగ్రికి ర్యాక్‌లు, టీచర్లకు ట్యాబ్‌లు, దుస్తులు ఆరేసుకునేందుకు ప్లాట్‌ఫాం, పాఠశాల ఆవరణలోని గ్రౌండ్ చదును చేయడంతో పాటు రోప్ నిర్మాణం చేశారు.

వసతులు బాగున్నాయి



మేడం చొరవతోనే కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు సమకూరాయి. గతంలో ఇవన్నీ వసతులు ఉండేవి కావు. ప్రస్తుతం పాఠశాల చాలా బాగుంది. పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు స్పెషల్ ఆఫీసర్ సాయిలక్ష్మి మేడం ఎంతో కృషి చేస్తున్నారు. నాణ్యమైన బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– ఆర్.పల్లవి, బైపీసీ ద్వితీయ సంవత్సరం

సొంత పిల్లల్లా చూసుకుంటారు



జీఈ వెర్నవా కంపనీ సహకారం, ఎస్ఓ సాయిలక్ష్మి మేడం కృషితో కేజీ వీబీలో సమకూరిన వసతులు విద్యాభివృద్ధికి ఉపయోగకరంగా ఉన్నా యి. వసతులతో పాటు ఎన్‌జీఓలతో విద్యార్థులకు కెరియర్ గైడ్‌లెన్స్ ఇప్పిస్తున్నారు. విద్యార్థులనుసొంత పిల్లల్లా చూసుకుంటున్నారు. సాయిలక్ష్మి మేడం రావడం మా అదృష్టం.

– బి.చందన, ఎంపీసీ, ప్రథమ సంవత్సరం

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు

మోటకొండూర్: రోడ్డు పక్కన నిల్చున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మోటకొండూర్ మండలం ఆరెగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెగూడెం గ్రామానికి చెందిన కొల్లూరు శ్రీనివాస్ రాత్రి 7.30 గంటల సమయంలో తన వ్యవసాయ పొలం నుంచి ఆవు పాలు తీసుకొని బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో గ్రామానికి చెందిన వ్యక్తులు కలవడంతో వారితో రోడ్డు పక్కన నిల్చుని మాట్లాడుతుండగా.. తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన దేశెట్టి మహేష్ ద్విచక్ర వాహనంపై మోటకొండూర్ వైపు నుంచి అతివేగంగా వస్తూ శ్రీనివాస్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు బలమైన గాయాలయ్యాయి. అతడిని గ్రామస్తులు భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

నూతనకల్: విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందిన ఘటన నూతనకల్ మండలం దిర్శనపల్లి క్రాస్ రోడ్ వద్ద ఆదివారం జరిగింది. మద్దిరాల మండలం చిననెమిల గ్రామానికి చెందిన నిమ్మరబోయిన శ్రీనివాస్, ఉమ దంపతుల కుమారుడు జీవన్(14) చిననెమిల జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. సెలవు రోజుల్లో నూతనకల్ మండలం దిర్శనపల్లి క్రాస్ రోడ్ వద్ద లింగాల అంజయ్య అనే డీజే నిర్వాహకుడి వద్ద ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఎర్రపహాడ్ గ్రామంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు డీజే ఆపరేట్ చేసేందుకు జీవన్‌ను వెళ్తుండగా.. వర్షం రావడంతో డీజే బాక్స్‌లు తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు 11కేవీ వైర్లు తగిలి జీవన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం అతడిని 108 వాహనంలో సూర్యాపేటకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులోని రాశి సిమెంట్ కంపెనీలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంబిహారి(35) కొంతకాలంగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ కంపెనీకి సంబంధించిన క్వార్టర్స్‌లో రాంబిహారి ఒక్కడే ఉంటున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకొని క్వార్టర్స్‌కు వెళ్లాడు. రెండు రోజుల నుంచి రాంబిహారి కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుంటే అతడు స్పందించడంలేదు. దీంతో అదే కంపెనీలో పనిచేస్తున్న మరొకరికి ఫోన్ చేయగా.. వారు రాంబిహారీ ఉంటున్న క్వార్టర్‌కు వెళ్లి చూడగా దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి పరిశీలించగా రాంబిహారి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది కనిపించాడు. రాంబిహారి విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి బాలుడి దుర్మరణం

నేలకొండపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో ఆ ట్రాక్టర్ నడిపిస్తున్న బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన వస్రాంనాయక్(17) ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో వస్తుండగా.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామ శివారులో మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వస్రాంనాయక్ ట్రాక్టర్ టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల తనిఖీలు తప్పించుకునేందుకు పలు గ్రామాలకు తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నారని, అంతేకాక మైనర్లకు వాహనాలు ఇస్తుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యమైనట్లు తెలుస్తోంది.

నేటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు

- వేడుకలకు ముస్తాబైన శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం
- సిద్ధమైన మండపాలు
- ఈ ఏడాది 11 రోజులు పూజలు అందుకోనున్న దుర్గాదేవి


యాదగిరిగుట్టలో యాదగిరి క్షేత్రం నమూనాలో ముస్తాబైన దుర్గాదేవి మండపం

యాదగిరిగుట్ట: దేవీ శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాలు, ఊరూరా మండపాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలను మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి, వివిధ ఆకృతుల్లో అమ్మవార్లను ప్రతిష్ఠింపజేయడానికి సిద్ధమయ్యారు. భక్తులు దుర్గాదేవి మాలధారణ చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

❖ ఈ సారి 11రోజుల పాటు ఉత్సవాలు..

ప్రతి ఏటా దేవీ శరన్నవరాత్రోత్సవాలు 9 రోజులు మాత్రమే జరుగుతుంటాయి. కానీ ఈ సారి 11 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. చవితి తిథి రెండు రోజులు వచ్చిన కారణంగా 11 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని అర్చకులు చెబుతున్నారు. మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవిగా, 2వ రోజు గాయత్రీ దేవిగా, 3వ రోజు అన్నపూర్ణ దేవిగా, 4వ రోజు కాత్యాయని దేవిగా, 5వ రోజు మహాలక్ష్మిగా, 6వ రోజు లలితా త్రిపురసుందరి దేవిగా, 7వ రోజు మంగళచండీ దేవిగా, 8వ రోజు సరస్వతి దేవిగా, 9వ రోజు దుర్గాదేవిగా, 10వ రోజు మహిషాసురమర్దినిగా, 11వ రోజు రాజరాజేశ్వరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనుంది. ఆయా అమ్మవారి ఆలయాల్లో వారి వెసులుబాటును బట్టి అలంకారాలను చేస్తారు.

❖ యాదగిరి కొండపై..

యాదగిరి కొండపైన గల శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సోమవారం ఉదయం శ్రీకారం అర్చకులు చుట్టనున్నారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు రూ.1,116, ఒక్క రోజు సప్తశతి పారాయణం చేయుటకు రూ.116, లక్ష కుంకుమార్చనకు రూ.116 రుసుము చెల్లించి పూజల్లో పాల్గొనవచ్చునని ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా శివాలయంలో నిర్వహించే రుద్ర హోమాన్ని 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దుచేసినట్లు పేర్కొన్నారు.

❖ తూర్పు రాజగోపురం చెంత శమీ పూజ

ఆశ్వయుజ శుద్ధ దశమిని పురస్కరించుకొని అక్టోబర్ 2వ తేదీ సాయంత్రం 5.30గంటల సమయంలో పాంచరాత్ర ఆగమశాస్త్ర అనుసారం యాదగిరీశుడి ఆలయ తూర్పు రాజగోపురం ముందు శమీ పూజ నిర్వహించనున్నారు.

రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి భూ నిర్వాసితుల వినతి

సంస్థాన్ నారాయణపురం, నల్లగొండ టూటౌన్: ప్రభుత్వం విడుదల చేసిన రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ వలన తీవ్రంగా నష్టపోతున్నామని భూములు కోల్పోతున్న రైతులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. సంస్థాన్ నారాయణపురం మండల రైతులు ఆదివారం బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వారిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా అలైన్‌మెంట్ చేయడం వల్ల తాము భూములు కోల్పోయి రోడ్ల మీద పడే పరిస్థితి వచ్చిందని భూనిర్వాసితులు వాపోయారు. మార్కెట్ ధర ఎకరం కోట్ల రూపాయలు పలుకుతుంటే నామమాత్రంగా నష్టపరిహారం ఇచ్చి మా భూములు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 40కి.మీ. దూరంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించాల్సి ఉండగా.. సంస్థాన్ నారాయణపురం మండలంలో కేవలం 28కి.మీ. వరకే తీసుకుని అలైన్‌మెంట్ ఇచ్చారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, ఎన్. రాంచందర్‌రావు మాట్లాడుతూ.. తగిన న్యాయం జరిగేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దోనూరి వీరారెడ్డి, మండల అధ్యక్షుడు సుర్వి రాజు, రైతులు పల్లె పుష్పారెడ్డి, పల్లె శేఖర్‌రెడ్డి, గాజుల భగత్, పల్లె భాస్కర్‌రెడ్డి, గాజుల అంజయ్య, బద్దుల వెంకటేష్, కొలను మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంకు వినతి..

గట్టుప్పల్: గట్టుప్పల్, మర్రిగూడ మండలాలకు చెందిన రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులు తమకు అండగా ఉండాలని కోరుతూ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. రీజినల్ రింగ్‌రోడ్డు కొత్త అలైన్‌మెంట్ వల్ల కార్పొరేట్ కంపెనీలు, భూస్వాములకు లాభం జరుగుతుందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు భూనిర్వాసితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్, ఆశన్న, భూనిర్వాసితుల నాయకులు భీమగాని మహేష్‌గౌడ్, పల్లె శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పుష్పారెడ్డి, మల్లేశం, వాసు తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణంలో వేగం పెంచాలి

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

కోదాడ: కోదాడలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం రాత్రి ఆయన ఆస్పత్రి పనులను పరిశీలించి మాట్లాడారు. గతంలో ఉన్న పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా తానే మార్చానని, ఇప్పుడు వంద పడకల ఆస్పత్రిగా కూడా తాను మంత్రిగా ఉన్న సమయంలోనే మంజూరు చేయించానని అన్నారు. రాష్ట్రంలో 3 సిటీ స్కాన్ యంత్రాలు మంజూరైతే రెండింటిని కోదాడ, హుజూర్‌నగర్‌లలో ఏర్పాటు చేయించానన్నారు. సీటీ స్కాన్ యంత్రాల నిర్వహణకు అవసరమైన రేడియాలజిస్టులను, టెక్నీషియన్లను త్వరలో నియమిస్తామని అన్నారు. దీంతో పాటు కోదాడలో నవోదయ విద్యాలయంతో పాటు చిలుకూరులో యంగ్ ఇండియా స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ పడకల సంఖ్యను పెంచడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మంత్రికి ఆస్పత్రి సిబ్బంది బతుకమ్మలతో స్వాగతం పలికారు. అనంతరం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోతె లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ.244 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ లిఫ్ట్ ద్వారా మోతె, నడిగూడెం, మునగాల మండలాల్లో 46,712 ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, ఇరిగేషన్ అధికారులు రమేష్‌బాబు, శివధర్మతేజ, ఆర్అండ్‌బీ సీఈ సీతారామయ్య, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, డాక్టర్ దశరథ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

నల్లగొండ టౌన్ : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) ఐసీయూ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం వహించిన ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ కె. భార్గవ్‌ను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏప్రిల్ 2025 నుంచి ఇప్పటివరకు జీతాలు రాలేదని ప్రజావాణిలో తనకు దరఖాస్తు సమర్పించగా విచారణ చేసినట్లు పేర్కొన్నారు. ఆల్ఫా స్వయం శక్తి సంఘం కాంట్రాక్ట్ పీరియడ్ ఈ సంవత్సరం మార్చి 31తో ముగిసిందని, అయితే 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త ఏజెన్సీకి కేటాయించడం, అదే ఏజెన్సీని రెన్యువల్ చేసే విషయమై సీనియర్ అసిస్టెంట్ కె.భార్గవ్ జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఎలాంటి ఫైల్ సమర్పించలేదని విచారణలో తేలిందని పేర్కొన్నారు. దీంతో భార్గవ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశామని తెలిపారు. క్రమశిక్షణ చర్యల ప్రక్రియ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

కొండమల్లేపల్లి: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామానికి చెందిన అందుగుల శ్రీను(46) 20ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి కొండమల్లేపల్లికి వలస వచ్చి నివాసముంటున్నాడు. అతడికి ముగ్గురు కుమార్తెలు సంతానం. వారిలో ఇద్దరికి వివాహం అయ్యింది. ఆదివారం శ్రీను గుండెపోటుతో మృతిచెందగా.. అతడి చిన్న కుమార్తె సిరి తలకొరివి పెట్టింది. నిరుపేద అయిన శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు, స్థానికులు కోరుతున్నారు.

సాగర్ చూసేందుకు వచ్చి వ్యక్తి గల్లంతు


రాంబాబు


సాగర్ డ్యాం దిగువన కృష్ణా నదిలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

నాగార్జునసాగర్: కుటుంబ సభ్యులతో కలిసి నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చిన వ్యక్తి కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. ఈ ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతానికి చెందిన దిరిసెల రాంబాబు(45) ఫార్మా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అతడు తన భార్య సుహాసిని, ఇద్దరు కుమారులతో కలిసి నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. మధ్యాహ్నం వరకు కుటుంబ సభ్యులతో కలిసి సాగర్ అందాలను తిలకిస్తూ, ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు. అనంతరం స్నానాలు చేసేందుకు గాను సాగర్ డ్యాం దిగువన విద్యుదుత్పాదన కేంద్రానికి వెళ్లే దారిలోని శివాలయం పుష్కరఘాట్‌లోకి దిగారు. ఈ క్రమంలో రాంబాబు ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న భార్య, కుమారులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న సాగర్ ఎస్ఐ ముత్తయ్య ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి వరకు కూడా రాంబాబు ఆచూకీ లభించలేదు.

విహారయాత్రకు వెళ్తూ మృత్యు ఒడిలోకి..

- రోడ్డు ప్రమాదంలో శాలిగౌరారం మండల యువకుడు మృతి
- వికారాబాద్ జిల్లాలో ఘటన


సాయికుమార్ (ఫైల్)

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం తిరుమలరాయినిగూడెం గ్రామానికి చెందిన యువకుడు తన స్నేహితుడితో కలిసి బైక్‌పై విహారయాత్రకు వెళ్తూ వికారాబాద్ జిల్లా మన్నెగూడ మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం తిరుమలరాయినిగూడెం గ్రామానికి చెందిన నూనెముంతల సాయికుమార్ (27) నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్‌లో గుండె స్టంట్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి విధులకు వెళ్లిన సాయికుమార్ సాయంత్రం విధులు ముగియగానే హైదరాబాద్‌లో చదువుకుంటున్న అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు అయితగోని శివమణి వద్దకు బైక్‌పై వెళ్లాడు. అక్కడి నుంచి వారిద్దరు కలిసి వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, వాటర్‌ఫాల్స్ చూసేందుకు బైక్‌పై రాత్రి బయల్దేరారు. మరో అరగంటలో అనంతగిరికి చేరుకుంటారనగా.. వారి బైక్‌ను వికారాబాద్ జిల్లా మన్నెగూడ మండలం కండ్లపల్లి గ్రామ పరిధిలో రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందగా.. శివమణి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొంత సమయం తర్వాత శివమణి తేరుకుని జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. వెంటనే సాయికుమార్, శివమణి తల్లిదండ్రులతో పాటు స్నేహితులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లారు. శివమణిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఆదివారం సాయంత్రం సాయికుమార్ మృతదేహం తిరుమలరాయునిగూడెంకు చేరుకోగా రాత్రి అంత్యక్రియలు జరిగాయి. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో నూనెముంతల శంకర్, యల్లమ్మ దంపతుల రోదనలు మిన్నంటాయి.

ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య


మధుసూదన్‌ను పరామర్శిస్తున్న పులి లక్ష్మయ్య

సూర్యాపేటటౌన్ : ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడొద్దని, హక్కులను పోరాడి సాధించుకుందామని తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తూ జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇటీవల ఆత్మహత్యకు ప్రయత్నించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మధుసూదన్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు మనోధైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి త్వరగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షులు శివశంకర్, జిల్లా జేఏసీ అధ్యక్షుడు చీకూరి అశోక్ కుమార్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండి జహీర్, ఉపాధ్యక్షులు కల్లేపల్లి దశరథ, జాయింట్ సెక్రెటరీ బొజ్జ నిరంజన్‌కుమార్, మీడియా కన్వీనర్ పోలెపాక నవీన్ కుమార్, సభ్యులు అరవింద్, అరుణ్ కుమార్, భిక్షం, సైదులు, అరవింద్ కుమార్, కొత్తపల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతికి దన్ను

- ఇకపై జీఎస్టీ 5, 18 శాతం స్లాబ్‌లు మాత్రమే..
- 12, 28 శాతం స్లాబ్‌ల తొలగింపు
- వ్యవసాయ ఉపకరణాలన్నీ 5 శాతంలోకే..
- నేటి నుంచి అమలులోకి కొత్త స్లాబ్‌లు



భువనగిరి: జీఎస్టీ(గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్) స్లాబ్‌ల కుదింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. షాంపూలు, సబ్బులు, ఏసీలు, టీవీలు, సిమెంట్ వంటి రోజువారీ వస్తువుల ధరలు తగ్గనున్నాయి. దీని వల్ల ప్రజలకు ఆర్థిక భారం తగ్గి, కొనుగోలు శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా గ్రామీణ, మధ్య తరగతి వినియోగదారులు ఎక్కువ ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు జీఎస్టీ విధింపులో నాలుగు స్లాబ్‌లు ఉండగా వాటిని రెండింటికి కుదించారు. పేదలు, రైతులు, మహిళలు, యువత వినియోగించే వస్తువులు, 12 రకాల సేవలు, 18 శాతం ఉన్న వాటిని 5 శాతం స్లాబ్‌లోకి మార్చారు. ఇందులో అనేక రకాల నిత్యావసర వస్తువులు సైతం ఉన్నాయి. దీంతో కుటుంబ ఖర్చు తగ్గనున్నాయి. కుటుంబ ఖర్చులే కాకుండా వ్యక్తిగత ఖర్చు సైతం సుమారు 10 శాతం ఆదా అయ్యే అవకాశం ఉంది. కొత్త స్లాబ్‌లు సోమవారం నుంచి అమలులోనికి రానున్నాయి.

రైతులు, మహిళలకు లబ్ధి

సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలపై ప్రభుత్వం ఇప్పటికే రాయితీలను వర్తింపజేస్తోంది. కొంతకాలంగా వ్యవసాయ వస్తువులపై రాయితీలు తగ్గిపోవడమే కాకుండా పన్నుల వడ్డింపు పరిధిలోకి వెళ్లాయి. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరిగి వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రైతుకు వచ్చే నికర లాభం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలుపై పన్ను భారం తగ్గనుంది. రైతులు వినియోగించే ట్రాక్టర్ల టైర్లు, విడిభాగాలు, కొన్నిరకాల పురుగుల మందులు, సూక్ష్మపోషకాలు, స్ప్రింకర్లు, డ్రిప్ పైపులు, వ్యవసాయ పరికరాల కొనుగోలు ఖర్చులు తగ్గనున్నాయి. 18 నుంచి 12 శాతం స్లాబ్‌లోని వాటిని ఐదు శాతం జీఎస్టీ పరిధిలోకి తెచ్చారు. కుట్టు మిషన్లు, వాటి విడిభాగాలు, మహిళలు, చిన్నారుల కోసం వినియోగించే పలు రకాల వస్తువులపై కూడా పన్ను భారం తగ్గనుంది. విద్యార్థులకు సంబంధించి మ్యాప్‌లు, చార్టులు, గ్లోబ్‌లు, పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, నోట్‌బుక్స్ వంటి వాటిపై 12 శాతం నుంచి సున్నా శాతానికి పన్ను భారం తగ్గనుంది. నిత్యావసర వస్తువులలో తల నూనెలు, షాంపులు, టూత్‌పేస్ట్, సబ్బులు, టూత్ బ్రెష్, షేవింగ్ క్రీం, వెన్న, నెయ్యి, మజ్జిగ, పాల ఉత్పత్తులు, మిక్చర్, వంటసామగ్రి వంటి ఉన్నాయి. అంతేకాకుండా టీవీలు, చిన్న, మధ్య శ్రేణి కార్లు, బైకులు, వైద్య పరికరాలు, విద్యార్థులకు అవసరమైన వస్తువులపై కూడా పన్ను భారం తగ్గనుంది.

కుటుంబ ఖర్చులు ఆదా అవుతాయి



మహిళలు వినియోగించే కుట్టు మిషన్లు, వాటి విడి భాగాలతో పాటు చిన్న పిల్లలు ఉపయోగించే పలు రకాల వస్తువులపై పన్ను భారం తగ్గనుంది. పలు గృహోపకరణాలపై జీఎస్టీ తగ్గటం వల్ల కుటుంబ ఖర్చులు సుమారు 10 శాతం వరకు ఆదా అవుతుంది. రైతులు, మహిళలు, చిన్నారుల సైతం ఈ విధానం వల్ల ప్రయోజనం కలగనుంది.

– శ్రావణి, గృహిణి, భువనగిరి

రైతులకు ప్రయోజనం చేకూరుతుంది



జీఎస్టీ తగ్గింపుతో లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. వ్యవసాయ పనిముట్లు, యంత్రాలపై పన్ను భారం తగ్గనుంది. రైతులు వినియోగించే ట్రాక్టర్ల టైర్లు, విడిభాగాలు, కొన్ని రకాల పురుగు మందులు, సూక్ష్మపోషకాలు, స్ప్రింకర్లు, డ్రిప్ పైపులు కొనుగోలు చేయడంలో ఖర్చు ఆదా అవుతాయి.

– కస్తూరి సత్యనారాయణ, రైతు, వలిగొండ

చెర్వుగట్టు క్షేత్రంలో లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా అర్చకులు లక్ష పుష్పార్చన నిర్వహించారు. గట్టుపైన రాత్రి నిద్ర చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చెర్వుగట్టుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి ప్రత్యేకంగా ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సురేశ్‌శర్మ, సతీష్‌శర్మ, శ్రీకాంత్ శర్మ అర్చక బృందం, వేద పండితులు ప్రత్యేకంగా మహా మండపంలో లక్ష పుష్పార్చన, సహస్రనామార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, శివసత్తులు ఆలయం వద్ద బతుకమ్మ ఆడారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో గట్టుపైకి వాహనాలను అనుమతించలేదు. పూజల్లో దేవాలయ ఈఓ నవీన్‌కుమార్, సూపర్‌వైజర్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ : సాగర్ కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతుండటంతో ఆ అందాలను సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులతో నాగార్జునసాగర్ పరిసరాల్లో ఆదివారం సందడి నెలకొంది. కృష్ణాతీరంతో పాటు ఎత్తిపోతల, బుద్ధవనం అనుపు తదితర ప్రాంతాలను పర్యాటకులు సందర్శించారు. లాంచీల్లో నాగార్జునకొండకు వెళ్లారు. బుద్ధవనంలో ధాన్యం చేశారు.


లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

బృందావనపురం.. పంటల సాగులో ఆదర్శం

- పంట మార్పిడి చేస్తూ లాభాలు గడిస్తున్న రైతులు
- ఈ సీజన్‌లో బంతి తోటలు సాగు



బృందావనపురంలో రైతులు సాగు చేస్తున్న బంతి తోట

నడిగూడెం: నడిగూడెం మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బృందావనపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎప్పటికప్పుడు పంట మార్పిడిని అవలంబిస్తూ భిన్న పంటలను సాగు చేస్తూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. బృందావనపురం గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు పలువురు ప్రస్తుత సీజన్‌లో ముందుగా పెసర సాగు చేపట్టారు. ఆ పంట పూర్తవ్వగానే అర ఎకరం, ఎకరం విస్తీర్ణంలో బంతి సాగు చేపట్టారు. బంతి 120 నుంచి 140 రోజుల పంట కావడంతో.. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల నాటికి డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో బంతి సాగు చేపట్టారు. ప్రైవేట్ హైబ్రిడ్‌లు, పొట్టి రకం, పొడవు రకం, ముద్ద రకం, పసుపు, నారింజ రకాలను సాగు చేశారు. నారును ఏపీలోని కృష్ణాజిల్లా చిల్లకల్లు ప్రాంతం నుంచి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. బంతి నారు నాటి రెండు నెలలు తర్వాత పూలు పూస్తాయి. బతుకమ్మ పండుగకు నడిగూడెం, బృందావనపురం, వేణుగోపాలపురం, కరివిరాల, చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం, కాగితరామచంద్రాపురం, సిరిపురం, నారాయణపురం, శ్రీరంగాపురం, వల్లాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం గ్రామాలకు చెందిన ప్రజలు బృందావనపురం వచ్చి బంతి పూలు కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం సీజన్ ఆరంభమవ్వడంతో కిలో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు.

కనువిందు చేస్తున్న బంతి తోటలు

బృందావనపురం నుంచి కాగితరామచంద్రాపురం రహదారి వెంట పలు చోట్ల బంతి తోటలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఆ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. ఎరుపు, పసుపు రంగుల్లో బంతి తోటలు కనిపిస్తుండడంతో పలువురు ప్రయాణికులు ఫొటోలు దిగుతున్నారు.


రెండేళ్లుగా బంతి సాగుచేస్తున్నా..



నాకున్న వ్యవసాయ భూమిలో గత రెండేళ్లుగా బంతి సాగు చేస్తున్నా. ఈ సారి భిన్నంగా మల్చింగ్ పద్ధతిలో సాగు చేపట్టాను. ఇప్పుడే సీజన్ ప్రారంభమైంది. కిలో బంతి పూలు రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నాం.

– చాపల సురేష్, యువ రైతు, బృందావనపురం

ప్రభుత్వం ప్రోత్సహించాలి



గత నాలుగేళ్లుగా పంట మార్పిడి అవలంబిస్తున్నా. మా లాంటి చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి. విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసి ప్రోత్సహిస్తే బాగుంటుంది. ఒకే రకంగా కాకుండా పలు రకాలను సీజన్‌కు అనుగుణంగా సాగు చేస్తున్నాను. మా ప్రాంత నేలలు కూడా అనుకూలంగా ఉన్నాయి.

– మేకపోతుల వెంకన్న, రైతు, బృందానపురం